# అద్దె ఇల్లు

సిహెచ్.వి.ఎస్.
బ్రహ్మానందరావు

ఉదయం పదకొండు గంటలు. కంప్యూటర్‌తో కుస్తీ పడుతున్నాను. ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లంటే ఇలాగే తగలడ్తాయ్. కాసేపు పనిచేస్తాయ్, కాసేపు మొండి కేస్తాయ్. మేం మాత్రం సిన్సియర్‌గా చేసిచస్తున్నామా? పదిన్నరకి ఆఫీస్‌కి వస్తాం. పెరగబోయే డి.ఎ. గురించి, ఇంటీరియం రిలీఫ్ గురించి ఎవరికి ఎంత వస్తుందా అని లెఖ్ఖలు వేస్తాం.

పెరిగిన జీతంకన్నా మార్కెట్‌లో ధరలు మూడింతలుంటాయి. అయినా ప్రభుత్వంవారు మామీద ప్రేమతోనో, జాలితోనో పెంచుతారా? బయట ధరలనిబట్టే కదా!

కూరగాయల ధరలు వేసవి సూర్యునిలా భగ్గుమంటున్నాయని మా ఆవిడ ముక్కు చీదుతుంది. అయినా దీని తెలివి సంతకెళ్ళినట్లు పదిసార్లు ముక్కుచీదితే మాత్రం పెరిగిన ధరలు తగ్గుతాయా ఏమిటి? పచారికొట్టు షాపు వాడు వున్నాడు. "ఏమిటయ్యా! వారం రోజుల క్రిందట కందిపప్పు ఏభైరూపాయలన్నావు, ఇపుడేంటి అరవై అంటున్నావు" అంటే-

"భలేవారు సార్! మీకు ఇంకా ఏ యుగంలో వున్నారు, ధరలు అలానే పెరిగిపోతాయి, మన చేతుల్లో ఏంవుంది? సెల్‌ఫోన్ తప్ప" అంటాడు పళ్ళికిలిస్తూ.

వాడు ధరల గురించి మాట్లాడినందుకు కోపంరాదు, కాని కొసమెరుపుగా పళ్ళికిలించినందుకు ఆవేశం తన్ను కొస్తుంది. అయినా ఏం చేస్తాం. మధ్యతరగతివాడి కోపం 'గ్యాస్'కి చేటని, గట్టిగా మాట్లాడితే సరుకులు ఎక్కడ కట్ చేస్తాడోనని భయం.

"గోపాలకృష్ణగారు! మీకు ఫోన్" అన్నాడు అటెండర్ పాపారావు.

సెల్‌ఫోన్ తగలడిందిగా, ల్యాండ్‌లైన్‌కి చేయటమెందుకు! అయినా ఎవరు చేసుంటారు అనుకుంటూ ఆఫీసర్ గదిలోకి అడుగెట్టాను.

"ఏమయ్యా! ఎన్నిసార్లు చెప్పాను! ఆఫీసు ఫోన్ నెంబర్ ఎవరికి ఇవ్వొద్దని, అయినా ఆఫీస్ పని ఎగ్గొట్టి సెల్‌ఫోన్‌లలో గంటలకొద్దీ మాట్లాడుకుంటూనే వున్నారుగా! అయినా ఎవడయ్యావాడు కొంచెమైనా 'కామన్ సెన్స్' లేకుండా" అన్నాడు ఆఫీసర్ ముకుందరావు.

"ఏడ్చి మొహం కడుక్కున్నట్లుంది, మాట్లాడకుండా ఎవడో ఎలా తెలుస్తుంది!" అన్నాను.

"అవునుకదా! సరే మాట్లాడు"

"హలో! ఎవరు మాట్లాడేది!"

"నేనురా! సుధాకర్‌ని"

"నువ్వా! ఏంటి సర్‌ప్రైజ్! ఎన్నాళ్ళు... కాదు, కాదు ఎన్నేళ్ళవుతోంది నిన్ను చూసి. అయినా ఫోన్ చెయ్యాలంటే సెల్‌కి చెయ్యొచ్చుగా! ల్యాండ్‌కెందుకు చేశావ్?"

"నువ్వు నాకు ఇచ్చింది ల్యాండ్ నెంబరేగదరా? సెల్‌ఫోన్ నెంబరు ఎక్కడ ఇచ్చావు! ఇంతకీ ఫోన్ ఎవరు తీసింది, కరుస్తున్నాడు"

"ఆయన మా ఆఫీసర్‌లే! ఇంట్లో వాళ్ళావిడ వాయించుతుంది. అందుకే ఆ కోపమంతా మాపైన చూపిస్తాడు. ఇంతకీ ఫోన్ ఎందుకు చేశావో చెప్పలేదు"

"నాకు ట్రాన్స్‌ఫర్ అయిందిరా! ప్రమోషన్ ఇచ్చారు!"

"కంగ్రాచ్యులేషన్స్! ఎక్కడికి వెళుతున్నావు!"

"ఎక్కడో అయితే నీకు ఫోన్ ఎందుకు చేస్తాను? విజయవాడకే!"

"అలాగా! అంటే నీకు బాడ్‌టైమ్ స్టార్టయింది. బాధపడకు ఏంచేస్తాం"

"నేనెందుకు బాధపడతానురా! చాలా సంతోషంగా వున్నాను. ప్రమోషన్‌తోపాటు జీతం కూడా పెరిగింది కదా! సరే మాటల్లో చెప్పటం మర్చిపోయాను. అన్ని వసతులు వుండే 'అద్దె ఇల్లు' చూడు"

''ఏంటి బాబు! ఏదో స్వీట్‌షాప్‌కెళ్ళి కేజి స్వీటు పట్టుకురా అన్నంత తేలికగా చెప్పావు!''

''ఏంటిరా నీ వేళాకోళం''

''వేళాకోళంకాదురా, యమ సీరియస్‌గా చెపు తున్నాను. పొలోమంటూ కుటుంబసమేతంగా రాకు. చాలా ఇబ్బందులు ఎదుర్కోవాలి. నువ్వొక్కడివే రా! పరి స్థితులు అనుకూలిస్తే... తర్వాత ఫ్యామిలీని తెద్దువు గాని...''

''అంటే అద్దెకి ఇల్లు దొరకటం అంత కష్టమా?''

''ఒరేయ్! గతంలో ఆఫీసర్‌కి గుమాస్తాలకి మధ్య గొడవలొస్తే ఆఫీసర్‌లు తమ కసి తీర్చుకోవడానికి అండ మాన్‌కు బదిలీ చేసేవారు. కాని ప్రస్తుతం విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం పంపుతున్నారు. నీకిచ్చింది ప్రమోషన్ పేరుతో డిమోషన్. అందుకే ఆఫీసర్‌లతో జాగ్రత్తగా వుండాలి. పాపం నీకు పరిస్థితి తెలీక ప్రమోషన్ వరమనుకుంటున్నావు. అది నీకు శాపం'' అన్నాడు.

''ఏమిటో నాకు ఒక్కముక్క అర్థంకాలేదు. నేను రేపు వస్తున్నాను. బస్టాండ్‌లో దిగగానే ఫోన్ చేస్తాను. నీ సెల్ నెంబర్ చెప్పు!'' అన్నాడు.

''అలాగే నెంబర్ రాస్కో! కాని గుర్తుంచుకో ఒక్కడివే రా?'' అన్నాడు.

''అబ్బ అర్థమయిందిలేరా! ఎన్నిసార్లు చెపుతావ్! వుంటామరి'' అన్నాడు.

''ఎవరయ్యా! ఇంతసేపు వాయించాడు'' అన్నాడు ముకుందరావు.

''నా ఫ్రెండ్! పాపం ప్రమోషన్ ఇచ్చి ఇక్కడికి ట్రాన్స్ ఫర్ చేసారట. ఇక వాడి జీవితంలో ఇక్కడున్నన్నాళ్ళు సుఖపడేరోజులుండవు. పాపం అన్నీ కష్టాలే''

''ఏం ఫర్వాలేదు లేవయ్యా! అలవాటుపడతాడు. మనం బ్రతకటంలా!''

''మనదారి వేరండి! ఇరుకో బొరుకో సొంత కొంపలో పడి ఏడుస్తున్నాం. వాడు లంకంత ఇంటినుండి ఇక్కడికి వచ్చి ఎలా బ్రతుకుతాడో! ఏమో! అందులో అద్దె ఇల్లు, అసలది దొరుకుతుందో! లేదో!''

''ముందు నీ ఫ్రెండ్‌ని రానీ! అన్నీ అపశకున మాటలు నువ్వాను. ఏదో ఒకటి చేద్దాంలే!''

''ఓకే సార్! మీరామాత్రం ధైర్యం చెపితే అంతకంటే ఏంకావాలి!'' అని వెళ్ళాడు.

❖ ❖ ❖

ఉదయం 8 గంటలకి బస్టాండ్‌లో బస్ దిగాడు సుధాకర్.

అప్పటికే అక్కడికి వచ్చి ఎదురుచూస్తున్న గోపాల కృష్ణ సుధాకర్‌ని చూసి ''హలో సుధా! గుడ్‌మార్నింగ్!'' అన్నాడు.

''హలో గోపి! అబ్బో... అప్పటికీ ఇప్పటికీ చాలా మారిపోయావురా! కాస్త లావు అయినావులే!'' అన్నాడు.

''నువ్వు మాత్రం ఏం మారలేదురా!''

''ఏంటి! ఇక్కడే నిలబెట్టి వాయించేస్తావా? ఇంటికి తీసికెళ్ళి చెల్లాయిని పరిచయం చేసే కార్యక్రమం వుందా లేదా?'' అన్నాడు నవ్వుతూ.

''భలేవాడివిరా! పద వెళదాం!'' అన్నాడు.

ఇద్దరు స్కూటర్ స్టాండ్‌కి వచ్చారు.

స్టాండ్‌లో వున్న బైక్‌తీసి స్టార్ట్ చేశాక ''రారా! కూర్చో!'' అన్నాడు గోపాలకృష్ణ.

---

5 ఇంతకంటే నున్నగా, ఆముదం పూసినంత జారు డుగా కనిపించాయి.

వాళ్ళతాతగారికి గతంలో ఇదే ఆలోచన వచ్చిం దిట. అప్పుడొకసారి తిరగేశార్ట! మనవడు షాక్ తిన్నాడు. ఎంతైనా నా తాత కదా అని సమాధాన పడ్డాడు. చివరకు రాతిపలకలపై పెచ్చులులేపి, గరుకు చేసి అంటింప చేశాడు. ఇతని మనవడికి మరో ఛాన్స్ మిగిలి వుంది.

ఈ మానవ సంబంధాలని ఒక చిన్న సంఘటనతో ముగిస్తాను. ప్రేయసీ ప్రియులు పారిపోడానికి నిశ్చ యించుకున్నారు. ముహూర్తం పెట్టుకున్నారు.

అమ్మాయి గదికిటికీలోంచి కిందికి దిగేందుకు నిచ్చెన ఏర్పాటు చేసుకున్నారు. అర్ధరాత్రి. అంతా నిశ్శ బ్దం. అమ్మాయి కిటికీలోంచి నిచ్చెన మెట్లమీద అడుగు వేస్తోంది. దూరంగా వున్న ప్రియుడు రోడ్డు మీంచి సెల్‌ఫోన్‌లో జాగ్రత్త జాగ్రత్త అని హెచ్చరికలు చేస్తున్నాడు. నిచ్చెన జారిపోతుందేమోనని టెన్షన్ పడుతున్నాడు.

ఆమె నిచ్చెన సగందాకా వచ్చింది. ''మీ నాన్న లేస్తా డేమో... చూస్తాడేమో'' అని మళ్ళీ భయం భయంగా అన్నాడు ప్రియుడు. ఆమె నేలమీద అడుగుపెడుతూ, ఏం పర్లేదు దేవదా కింద నిచ్చెన పట్టుకున్నది మా డాడీయేలే'' అంది. ఈసారి ఖంగుతినడం దేవదాసు వంతు అయింది. ■

## అంబులెన్స్

కుయ్... కుయ్...
ఒకటే రోదనా సైరన్
ఎక్కడో ఓ గుండె పనిచేయటానికి మొరాయిస్తోంది
ఓ శరీరం ఆక్సిజన్ కోసం అల్లాడిపోతోంది
క్షణకాలం మితిమించిన వేగంలో
ఎవరో ఒళ్ళంతా ఛిద్రం చేసుకున్నట్లున్నారు
ఎడతెరపిలేని ఆలోచనలతో
విషాదం గుట్టలు పడుతుంది
కాపాడటానికి పరిగెత్తే ఆ సైరన్
వింటుంటేనే కాళ్ళూ చేతులు ఆడవు
ఏ అర్థరాత్రో విన్పిస్తే
తెల్లవార్లూ నిద్రకి సెలవే!
ఏ కుటుంబ కర్త ఏమౌతున్నాడో
ఏ తల్లికి వీడ్కోలో!
ఏ బంగారు తల్లికి రోజులు ఆగాయో!
నక్షత్రాల ఆస్పత్రుల్లో నోట్ల కోసం
ఏ ప్రాణాలు నలిగిపోనున్నాయో!
ఒకటే ఆలోచనల చీమలపుట్టలు
ట్రాఫిక్‌లో చిక్కుపడినఅంబులెన్స్‌ని చూసినప్పుడు
రోజు రోజుకి దిగజారుతున్న
ప్రాణం ఖరీదుని తల్చుకుంటూ
మనసు విలవిల...
పట్టించుకునే వాళ్ళే లేనప్పుడు
అది అంతిమయాత్రే!

డా// సి.భవానీ దేవి

సుధాకర్ కూర్చుని "పోనీయ్!" అన్నాడు.

పది నిమిషాల తర్వాత స్కూటర్ రేణుక అపార్ట్‌మెంట్ దగ్గర ఆగింది.

గోపాలకృష్ణ స్కూటర్ పార్కింగ్‌లో బైక్‌ఆపి, సుధాకర్‌తో మూడవ ఫ్లోర్‌లో వున్న తన ఫ్లాట్‌కి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు.

కాలింగ్‌బెల్ మోతకి పద్మ తలుపు తీసింది.

ఇద్దరు లోపలికి వచ్చాక...

"పద్దు, వీడే సుధాకర్. నా బెస్ట్ ఫ్రెండ్ అని చెపుతుంటానే, ఒరేయ్! ఈవిడ మా శ్రీమతి పద్మ" అన్నాడు.

నమస్కార ప్రతి నమస్కారాలయ్యాక...

"అన్నయ్యగారు! స్నానం చేసిరండి! టిఫిన్ రెడీగా వుంది" అంది.

సుధాకర్ టవల్, లుంగీ, పేస్ట్, బ్రష్ తీసుకొని బాత్రూంలోకెళ్ళాడు.

పావుగంటలో రెడీ అయి డైనింగ్ టేబుల్ దగ్గరకొచ్చి కుర్చీలో కూర్చుని.

"ఇపుడు చెప్పరా విశేషాలు! పిల్లలెంతమంది? ఏం చదువుతున్నారు?" అన్నాడు.

"నా సంతానం ముగ్గురు. పాప ఎం.ఎస్.సి పూర్తిచేసి రాజధానిలో ఉద్యోగం చేస్తుంది. పెద్దాడు డిగ్రీ ఫైనలియర్. చిన్నాడు ఇంటర్ సెకండియర్"

"అదేంట్రా! ఫ్యామిలీ ప్లానింగ్ పాటించలేదా! అయితే ఇంక్రిమెంట్ 'కట్' అన్నమాట. అవును గదులేమిట్రా ఇంత ఇరుకుగా వున్నాయి. బాత్రూమ్‌లో ఊపిరాడలేదంటే నమ్ము"

"ఏం చేస్తాం! అలవాటు చేసుకోరా ఇది నా స్వంతం కాబట్టి గదులు, బాత్రూమ్ ఇలా వున్నాయి. పాపం నీకు అదృష్టం కలిసివచ్చి అద్దెకు ఇల్లు దొరికితే... ఇంతకంటే ఇరుకు గదుల్లో నీవు కాపురం పెట్టాలి. చెప్పాను కదరా! ఇది విజయవాడ"

"విజయవాడ అంటే విశాలమైన వాడయని, విద్యలవాడయని... ఎన్నో అనుకున్నానే!"

"ఒకప్పుడు నిజమేరా! రియల్ ఎస్టేట్ భూతం ఆవరించాక, ఈ దుర్గతి పట్టింది. ఇక్కడ అడుగు స్థలం వుంటే బంగారం వున్నట్లు అనుకో! పాపాలు చేసినవారికి యమలోకంలో శిక్షలుంటాయని పెద్దవాళ్ళు చెపుతారు. కాని పాపాలు చేసినవారిని విజయవాడలాంటి చోట పుట్టిస్తున్నాడు ఆ భగవంతుడు"

"చెల్లెమ్మా! టిఫిన్ చాలా బాగుంది!" అన్నాడు.

"ఏదో మొహమాటంకొద్దీ అలాగంటున్నావు.ముందు ముందు వీటికే అలవాటుపడాలిమరి!" జాలిగా చూస్తూ అన్నాడు.

"ఏమిటోరా! నువ్వు మరీ భయపెట్టేస్తున్నావు!"

"కాదురా! అలవాటు పడతావని చెపుతున్నానంతే! సరే నీకు, నాకు ఆఫీసుకి టైం అవుతుంది. సాయంత్రం

ఆఫీసు అవగానే నీ బ్యాంక్ దగ్గరకొస్తాను, అటునుండి అద్దె ఇళ్ళ వేటలోపడదాం!'' అన్నాడు.

పద్మ ఇద్దరికి క్యారియర్‌లు సర్ది ఇచ్చింది.

''ఎందుకు చెల్లెమ్మా! శ్రమ. హోటల్‌లో తినేవాడ్నిగా!'' అన్నాడు.

''ఏంటి! హోటల్‌లో తింటావా? వంటిమీద స్పృహ వుండే మాట్లాడుతున్నావా!''

''ఏంటిరా! బాంబుపడ్డట్లు అలా అరిచావు!''

''ఆహ్! నువ్వు హోటల్ అంటేను. సరే సరే నేను సాయంత్రం కలుస్తాను'' అన్నాడు. ఇద్దరూ ఎవరి డ్యూటీకి వాళ్ళు వెళ్ళారు.

❖ ❖ ❖

సాయంత్రం 6 గంటలకి బ్యాంకు దగ్గరకొచ్చి సుధాకర్‌ని కలుసుకున్నాడు.

''ఒరేయ్ గోపి టిఫిన్ చేద్దాం పద!'' అన్నాడు.

అనుభవంలోకి రావాలని హోటల్‌కి తీసుకువెళ్ళాడు.

''ఏంట్రా టేబుల్స్, కుర్చీలు లేవు'' అన్నాడు.

''ఇది ఫాస్ట్‌ఫుడ్స్ సెంటర్. ఎవరికి వారే సర్వ్ చేసుకోవాలి. ఏ టిఫిన్ కావాలో టోకెన్‌లు పట్టుకురా!'' అన్నాడు.

కౌంటర్ దగ్గరకెళ్ళి... రెండు ప్లేట్స్ ఇడ్లీ, రెండు దోసె అని వంద రూపాయలు ఇచ్చాడు. టోకెన్‌లు ఇచ్చి ముప్పయి రూపాయలు చిల్లర ఇచ్చాడు.

''ఏమిటయ్యా! రెండు ప్లేట్ ఇడ్లీ, రెండు దోసె 70 రూపాయలా!'' అన్నాడు ఆశ్చర్యంగా.

అతను సుధాకర్‌ని పిచ్చోడిలెఖ్ఖ ఎగాదిగా చూస్తూ... ''ఏంటి! ఊరికి కొత్తా! వెళ్ళెళ్ళు'' అన్నాడు.

సుధాకర్ మాట్లాడకుండా గోపాలకృష్ణ దగ్గరి కొచ్చాడు.

టిఫిన్ చేశాక ''టీ తాగుదాం'' అనబోయి మాటలు మింగేసాడు. గోపాలకృష్ణ నవ్వుకున్నాడు.

వీధి వీధి తిరుగుతున్నారు. ఎక్కడా 'టులెట్' బోర్డు కనిపించలేదు. దాదాపు రెండు గంటలు తిరిగారు. తిరిగి తిరిగి కాళ్ళు నొప్పులు పుడుతున్నాయి. కాని బోర్డు మాత్రం లేదు.

''ఏంట్రా! రెండు వందల ఇళ్ళపైన తిరిగాం. ఇద సలు ఊరా! అడవా!''

''అడవి నయంరా! హాయిగా జీవించవచ్చు''

## కట్టెమీద కూడా నువ్వే

అవును
నేననుకోలేదు యిలా అవుతుందని
ఎప్పుడూ కలగనలేదు
యింతలా నా మనసునిండా
నువ్వు నిండిపోతావని!
ఒక చూపే అనుకున్నాను
ఒక నవ్వే అనుకున్నాను
నీతో నడచినది
ఒక అడుగే అనుకున్నాను!
నీ నా మధ్య
కాల యవనిక మీద
ఎన్నో మబ్బు తెరల తుఫానులు
రోహిణీకార్తెల గుండె పగుళ్ళు!
నువ్వు నన్ను నీ మానస సూత్రంతో
బలంగా లాగావనడం కన్నా
ఈ క్రూర ప్రపంచం
నన్ను నీవేపు వేగంగా
నెట్టిందనడమే సత్యం!
అర్థాలే, అపార్థాలే
మన మధ్య మొలిచిన అశాశ్వత కంటకాలే!
ఊహలే ఊసులే
మన మధ్య పారిన గల గల జలపాతాలే!
ఇవే నిన్నూ నన్నూ
బలంగా కుట్టిన మౌనక్షణాలు
నువ్వూ నేనూ
ఈ మట్టిపై రెండు బిందువులమీద
దూరంగా నిలుచున్నా
మన నెత్తిమీద ఒకటే ఆకాసం!
ఆఖరి క్షణాన
అంతిమయాత్రకు సాగుతున్న
నా బిగుసుకున్న పిడికిల్లో కూడా
నువ్వే!

డా।। మోపిదేవి విజయగోపాల్

# బాబోయ్ రాజకీయం!

నేటి నిరుపేదల ఓట్లు
నేతలకు పండించు కోట్లు
దేశప్రగతికే తూట్లు
తప్పవు ప్రజలకు గ్రహపాట్లు
  ఓటు నాకు ఏశేయ్ ఈ విడత
  చందమామనే తెచ్చి నీ చేత పెడత
  బొంకు నేతల ప్రతి తలుపు తడతా
  మోసపోయి చింతించు జనులు కంటతడిపెడత
పలు దుస్తులు ఒంటిన మార్చు తీరు
బహుపార్టీలు మార్చేను వీరు
నేతల తీరు తెన్నులు చూడు
కులటే నయమనిపించు పాడు
  అందినంత వెనకేసుకుంటా
  పదవి ఉండునో ఊడునో తంటా
  ప్రజాసేవ ఊసు దేవుడెరుగంటా
  మన నేతల తీరు యిదేనంటా
రాజకీయమంటే నీతికి నీళ్ళొదలటం
రాజకీయమంటే టోపీలు పెట్టడం
రాజకీయమంటే వేయి మాటలేల
రాజకీయమంటే భస్మాసురహస్తమే ఈనేల

  వంగి సలాము చేయు కుచ్చుటోపీ తోడు
  చేతులు జోడించి సాష్టాంగపడి వేడు
  కనుపడడెపుడు గెలిచినాక వీడు
  వీడు మానాయకుడే చూడు చూడు
వయసు పరిమితి లేదు శతవృద్ధుడైనా ఏలు
చదువు అక్కరలేదు నిశానియే చాలు
నీతిపరులు వద్దు నేరచరితులే మేలు
ముచ్చటగ ఈ మూడు అభ్యర్థికివే పదివేలు
  పవరుతోనే సాధ్యమవును ప్రజాసేవ
  నమ్మబలుకు నాయకులు ఓటరు మహాదేవా
  సేవా సంకల్పమున్న రెండు చేతులు చాలురా
  థెరిసామాత సేవకు ప్రతిరూపమై నిలిచెరా
నోరుజారునేత పెక్కుమార్లు
ఇదేమిటని ప్రశ్నింప మన్నింపమని వేడు
అందితే జుట్టు అందక పట్టు కాళ్ళు
పొగడ తరమా మన నేతని వేయి నోళ్ళు
  వాగ్దానాలు చేయుట నేతకు పరిపాటి
  వాటిని విస్మరించుటలో వీరికి వీరే సాటి
  వాగ్దానాలు వైఫల్యానికి ప్రతిపక్షాల నిర్వాకమని చాటి
  రాజకీయాన నెగ్గుకురావటంలో వీరు ఘనాపాటి

ఎ. శ్రీహరిప్రసాద్

అన్నాడు.

అలా తిరిగి తిరిగి వెళ్ళిపోదాం అనుకుంటూ వుండగా, సుధాకర్ కళ్ళు మెరిశాయి.

"గోపి! అదిగో రా బోర్డ్..." అన్నాడు.

"అవున్రా! నీ అదృష్టం. పద వెళదాం!" అన్నాడు.

ఇద్దరూ టులెట్ బోర్డు వున్న ఇంటిముందాగి లోనికి వెళ్ళారు.

ఒక కుర్రవాడు వాళ్ళద్దరిని చూసి- "ఎవరు కావాలండి!" అని అడిగాడు.

"ఇక్కడ ఇల్లు అద్దెకు ఇవ్వబడును అని బోర్డ్ పెట్టారు గదా!" అన్నారు.

"అదా! లిఫ్ట్‌లో నుండి అయిదవ ఫ్లోర్‌కి వెళ్ళండి. అక్కడ ఫ్లాట్ నెం. 506లోకి వెళ్ళండి. మోహనరావు అంకుల్ వుంటారు. ఆయనని అడగండి. వివరాలు చెపుతారు"

"థ్యాంక్సు బాబు!" అన్నారు.

కుర్రవాడు చెప్పిన విధంగానే లిఫ్ట్‌లో నుండి అయిదవ ఫ్లోర్‌కి వెళ్ళి ఫ్లాట్ నెం. 506 దగ్గర ఆగి కాలింగ్ బెల్ నొక్కారు.

ఒక మధ్య వయసాయన తలుపు తీసి వాళ్ళిద్దరిని చూసి- "ఎవరండి మీరు!" అన్నాడు.

"మోహనరావుగారంటే!"

"ఆఁ... నేనే! ఏమిటి పని?"

"అదే కింద ఇల్లు అద్దెకు ఇవ్వబడును అని బోర్డ్ పెట్టారుగదా!"

"అవును, అది సింగిల్‌రూమ్ ఒక్కరికి మాత్రం

సరిపోతుంది''

''అలాగా! మేం ఇల్లేమో అనుకుని వచ్చాం'' అన్నాడు గోపాలకృష్ణ.

''గోపి ఇలారా?'' అని పిలిచాడు సుధాకర్.

''ఏంటిరా!'' అన్నాడు.

''ప్రస్తుతం ఒక్క గదిలోనే వుండి నిదానంగా ఇల్లు చూసుకోవచ్చు గదా! ఏమంటావు?''

''నీ ఒక్కడికి గది ఎందుకురా! మా ఇంట్లో వుండొచ్చు గదా?''

''ఒరేయ్ నువ్వన్నట్ల ఇల్లు ఎప్పటికి దొరుకుతుందో! ఏమో! అన్నాళ్ళు మీ ఇంట్లో వుండటం బాగుండదు. అందులో మీది విశాలమైన ఇల్లుకాదు కదా! అందుకే!''

''సరే! పద! అద్దె అది మాట్లాడుదాం'' అన్నాడు.

''మోహనరావుగారు! మాకు గది చూపించండి! ప్రస్తుతం వుండేది ఒక్కరే! ఇల్లు దొరికితే వెళ్ళిపోతాం'' అన్నాడు.

''అలాగా! కాని, మీకు గది అద్దెకు ఇవ్వాలంటే కొన్ని కండిషన్స్ వున్నాయి''

''చెప్పండి! ఏమిటో!''

''మీరు 6 నెలల అద్దె అడ్వాన్స్ ఇవ్వాలి. 6 నెలలోపు మీరు ఖాళీ చేసినా అడ్వాన్స్ ఇవ్వబడదు. ప్రతి 6 నెలల కొకసారి అద్దె పెంచుతాం. సంవత్సరానికి ఒకసారి అంటే ప్రతి సంవత్సరం మార్చిలో రెండు నెలలు అద్దె ఇవ్వాలి. తర్వాత కరెంట్‌కి, మోటర్‌కి కూడా సంవత్సరానికొకసారి

## మనసులో మాట

మరపురాని ఆ క్షణాలు తలచుకొని
నీకోసం నిరీక్షిస్తూ
క్షణమొక యుగంలా గడుపుతూంటే
గలగలా గోదారిలా వచ్చి ఉరికావు!
చెట్టాపట్టాలేసుకొని తిరుగుతూ
ఎవరైనా చూస్తారేమోనని భయంతో
చాటుమాటుగా దాగిపోయాము!
నీకు తోడు నేనున్నానన్నావు
మనసు ఎక్కడికో విహరించింది
తీరంలో పడవలా ఊగిసలాడింది
ఝురీతరంగంలా సన్నగా వీచే చల్లగాలికి
నీ మనసులో మాట విన్నవించమంటే
హృదయం నా ముందు విప్పిపరిచావు
పెదవిదాటి రాలిన పలుకులు
ములుకులై నా గుండెను తొలిచాయి
సిగ్గుపడుతున్నావనుకొన్నాను
ప్రేమంటే పెళ్ళి-బాధ్యతలంటే భయం
ఎదురు చూపులు-విరహవేదనలు
అలకలు-కోపతాపాలు
నీది నాదనే స్వార్థం
హద్దులు మీరితే ఆవేశం
అన్ని తెగతెంపులు చేసుకొని వెళ్ళిపోవటం
కాలంలో విషాదంగా మిగిలిపోవటం
చేరువై దూరం కావటంకన్నా
దూరాన్నుంచే స్నేహంతో చేరువవుదాం!
అన్నావు!
ఆత్మీయతా అనుబంధాలు పెంచుకోవచ్చు
కష్టసుఖాలు కలబోసుకొని పలకరించుకోవచ్చు
దుఃఖాన్ని పంచుకోవచ్చు
ఆపదలో నేనున్నానంటూ కన్నీళ్ళుతుడవచ్చు
ఉత్తరాలు వ్రాసుకొంటూ
మళ్ళీ మళ్ళీ చదువుకొని భద్రంగా దాచుకోవచ్చు
స్నేహమంటే ప్రేమకన్నా గొప్పదన్నావు
నీ విశాలమైన మనసుని చూసి
నేను కురుచననిపించింది.
ఇప్పటికీ ఆ రోజుల్ని మరచిపోలేను
నువ్వు వ్రాసే ప్రతి ఉత్తరంలో
కొత్త జీవితాన్ని చవిచూస్తున్నాను
నీ అక్షరాల ఆప్యాయతకోసం
ప్రతిరోజూ ఎదురుచూస్తూనే ఉంటాను!

తాటికోల పద్మావతి

## చైతన్యం!

ఈ రాజకీయాలకు దూరంగా
ఈ ధర్నాలూ కొట్లాటలకు
ఈ రాస్తారోకోలు వాగ్వివాదాలు
ఈ హైజాక్‌లూ లూటీలకు
దూరంగా సుదూరంగా
ఈ బంధాలు అనుబంధాలు
ఈ ప్రేమలూ కష్టలూ
ఈ సుఖాలూ దుఃఖాలూ
ఈ మరణాలు ప్రసవాలకు
దూరంగా సుదూరంగా
ఈ విద్యాభ్యాసాలు కుతంత్రాలు
ఈ ఆసుపత్రులు ఎక్సరేలు
ఈ రోడ్లూ కాలువలూ
ఈ హద్దులూ ఎల్లలకూ
దూరంగా సుదూరంగా
ఈ విధాలూ విధానాలు
ఈ సాంప్రదాయాలూ కట్టుబాట్లూ
ఈ శాస్త్రాలూ గణితాలూ
ఈ న్యాయాలూ అన్యాయాలకూ
దూరంగా సుదూరంగా
ఈ వార్తలూ ఛానెళ్ళూ
ఈ నృత్యాలూ భంగిమలూ
ఈ చిత్రాలు విచిత్రాలు
ఈ పథకాలూ పర్మిట్లకూ
దూరంగా సుదూరంగా
ఈ దొంగతనాలూ హత్యలూ
ఈ క్లబ్బులూ పబ్బులూ
ఈ భవనాలూ గుడిశెలూ
ఈ కవితలూ కథలూ
నీకక్కర్లేదా? ఐతే
నువ్వు బ్రతికున్న శవానివి!!

– గుడిమెట్ల గోపాలకృష్ణ

పెంచుతాం.నెలకి మెయింటెనెన్స్ ఇవ్వాలి. డీజిల్‌కి కూడా ఇవ్వాలి. అద్దెకుంటున్నందుకు ఫ్లాట్‌లో సభ్యత్వం తీసుకోవాలి. ఇంకా కొన్ని కండిషన్స్ మధ్యమధ్యలో అమలవుతాయి.

''ఇంతకీ అద్దె ఎంతో చెప్పారు కాదు''

''ప్రస్తుతం రెండువేలు, కరెంట్ రెండు వందలు, మోటర్ వంద, డీజిల్‌కి ఏభై, మెయింటెనెన్స్ అయిదు వందలు. మొత్తం రెండువేల ఎనిమిదివందలయాభై. అడ్వాన్స్ పన్నెండు వేలు''

''ఒరేయ్ గోపి! నాకు కళ్ళు తిరుగుతున్నాయిరా! గట్టిగా పట్టుకో!'' అన్నాడు.

''పిచ్చోడా! అపుడే ఏమయింది. ముందు గది చూడు'' అన్నాడు.

''ఓ మాటల్లో పడి గదిని చూపించలేదు, రండి అంటూ తాళం తీసుకుని గది దగ్గరికి వెళ్ళి తాళం తీసి తలుపు తెరిచి లైట్ వేశాడు''

ఆ గది చూస్తుంటే మూర్ఛ వచ్చినంత పనయింది సుధాకర్‌కి.

''తమాయించుకో!'' అన్నాడు సుధాకర్‌ని గిల్లుతూ.

''అబ్బ! అంత గట్టిగానా!'' అన్నాడు కోపంగా.

''నువ్వు తెలివిలో వుండటానికి అలా చేశాన్లే'' అన్నాడు.

అగ్గిపెట్టె కంటే ఇరుగ్గా వుందాగది. ఒకే ఒక కిటికి. దాన్ని కిటికీ అనేకంటే ఎలక కన్నం అంటే బాగుంటుందేమో. ఒకే ఒక ట్యూబ్‌లైట్, ఒక ఫ్యాన్ అంతే.

''బాత్రూం ఎక్కడండి!'' అన్నాడు నీరసంగా.

''ఎటాచ్‌డ్ అంటే'' మూలగా వున్న తలుపు తీశాడు. అంతే అది చూసేసరికి ఇద్దరికి వాంతి వచ్చేట్లు అనిపించి, దఢేల్మని తలుపుమూసారు.

''మేం ఆలోచించుకుని చెపుతానండి!'' అని బయటికి వచ్చారు.

''అబ్బ అసలు గదిలో ఎలుకలు, పందికొక్కులు కూడా వుండవు గదరా!''

''అప్పుడింకా అదృష్టమే గదరా! ఎలకల బాధ వుండదు గదరా!''

''ఏడిశావు! వెధవ జోకులు నువ్వును'' అన్నాడు.

''ఇక ఇవ్వాల్టికి ఓపిక హరించుకుపోయింది. మళ్ళీ రేపు ఇంకో సెంటర్‌లో వెతుకుదాం''

ఇద్దరు ఇంటికి చేరేసరికి తొమ్మిదయింది.

❖ ❖ ❖

మరుసటి రోజు సాయంత్రం మళ్ళీ అద్దె ఇళ్ళ వేటలో

## తోడు

ఈ పెన్ను ఎంతకాలం రాస్తుందో!
ఈ సిరా ఇంకెన్ని కిలోమీటర్లు
ప్రయాణిస్తుందో!
ఈ పువ్వులు
పాళీలోంచే రాల్తున్నాయా,
హృదయంలో ముంచి తీసినప్పుడు
పొడమిన మొగ్గలు
ఇప్పటికి వికసించాయా!
ఎన్ని వంకలు
ఎన్ని సృష్టిమనోహర వక్రతల సమాహారం
ఈ అక్షర సమామ్నాయం!
జేబులో పైసలు లేకపోవచ్చు
పెన్నులేకుంటే మాత్రం
అది భావశూన్య నీరవకుటీరమౌతుంది.
నాగలికీ కలానికీ
పోలిక సార్వకాలిక
అది మట్టిని దున్నితే
ఇది మట్టి మహత్తును వెలికి తీస్తుంది
అది వేర్లను నిమురుతూ
చిగురును కలగంటే
ఇది సృష్టి రహస్యాల చీకటిని వెలుగు చేస్తుంది
పెన్ను లేకుంటే నాకు
చెయ్యి విరిగినట్టే
పెన్ను కదలకుంటే
కాలుకుంటినట్టే
కలలూ కన్నీళ్ళూ
సకల సంవేదనలూ
అన్నిటికీ దోసిలి పట్టిన
మట్టి గిన్నె నా కలం
మృత్తిగా గంధంలో ముంచి
నా నొసట
విశ్వాంతరాళాన్ని చిత్రించిన
మాంత్రిక కుంచె నా కలం
నాదొక్కటే కోరిక
నేను పోతే
నాతోపాటు పెన్నునూ కాల్చెయ్యండి
నేను లేకపోతే
పాపం! ఒంటరిదైపోతుంది

డా॥ ఎన్.గోపి

పడ్డారు.

వీధులేకాక, సందులు, గొందులు కూడా తిరిగారు. తెలిసినవాళ్ళు కనిపిస్తే వాళ్ళకి తమ ఘోష వినిపించారు. వారు సానుభూతి తెలిపారు. అంతకన్నా మేమేం చెయ్యగలం! అని నిట్టూర్చి వెళ్ళిపోయారు.

తిరిగి తిరిగి అలసిపోయారు. రోడ్డుపక్క టీ తాగారు. కొద్దిగా ఓపిక వచ్చింది.

''ఏంటి సార్! పిచ్చికుక్కల్లా తిరుగుతున్నారు'' అన్నాడు టీ తాగుతూ ఓ వ్యక్తి.

''నీ పోలిక మండ! మేం అలా కనపడుతున్నామా!'' అన్నాడు సుధాకర్.

''లేదులెండి! మీ మొహాలు చూస్తుంటే ఏదో విలువైనది పోగొట్టుకున్నట్లు కనిపిస్తుంది''

''రెండు గంటల్లో మన ఫేస్‌లు అంత భయంకరంగా మారిపోయాయా గోపి!'' అన్నాడు సుధాకర్.

''ఏమో! మారినట్లే కనపడుతుంది. లేకపోతే వాడు అలా ఎందుకంటాడు'' అన్నాడు గోపి.

''ఇంతకీ మీరెవరు?''

''నేనా! అద్దె ఇల్లు చూపించే బ్రోకర్‌ని''

''ఏమిటి! అద్దెకి ఇల్లు ఇప్పించే బ్రోకర్‌వా! విచిత్రంగా వుందే, పెళ్ళిళ్ళు చేయించే బ్రోకర్లను చూశాం. నోములు, వ్రతాలు చేయించేవాళ్ళని చూశాం. కొంపలు అమ్మేవాళ్ళను, కొనేవాళ్ళను చూశాం. రిగ్గింగ్‌లు చేసుకునే రాజకీయ నాయకులను చూశాం. కాని అద్దె ఇళ్ళు ఇప్పించే బ్రోకర్‌ని ఇపుడే చూస్తున్నాం''

''ఔరా! కలియుగమా? మజాకానా?''

''కలియుగం కాదుబాబు! ఆకలి యుగం... ఆహా! కంప్యూటర్, రాకెట్ల యుగం''

''ఈ బ్రోకర్ మనకి తారసపడటం ఎలావుందంటే... వెతకబోయిన 'అద్దె ఇల్లు' ప్రత్యక్షం అయినంత ఆనందంగా వుంది'' అన్నాడు సుధాకర్.

''అవును బ్రోకర్‌గారు! ఎక్కడా 'అద్దె ఇల్లు' బోర్డులు లేవుగదా! మీరెలా ఇప్పిస్తారు!'' అన్నాడు అనుమానంగా గోపి.

గోపిని వెర్రివాడిని చూసినట్లు చూసి- ''ఇపుడెవరూ బోర్డులు పెట్టంలేదండి! ఇదంతా లోపాయికారి వ్యవహారం. ఇంటి యజమానులకి, మాకు ఒక అండర్‌స్టాండింగ్ వుంటుంది. ఆ విధంగా వాళ్ళకి అద్దె ఎక్కువ వస్తుంది. మాకు కమీషన్ వస్తుంది!''

''ఈ వ్యాపారమేదో బానేవున్నట్లుందే! ఇంతకీ మీ పేరు!''

''నా పేరు చిన్నారావు! ఇపుడు చెప్పండి. మీకు ఇల్లు ఏ ఏరియాలో కావాలి!''

''ఎక్కడైనా ఫర్వాలేదు! 'ఇల్లు బాగుంటే చాలు. ఏరియాదేముంది!'' అన్నాడు సుధాకర్.

''ఏరియాని అంత తేలిగ్గా తీసేయకండి మరి'' ఒక్కో ఏరియాని బట్టి ఒక్కో రేటు ఉంటుంది. కమర్షియల్ ఏరియా అయితే కమర్షియల్ రేటుంటుంది. వి.ఐ.పి ఏరియా అయితే ఒక రేటు, జనరల్ ఏరియా అయితే ఒక రేటు. గదులనిబట్టి కూడా రేట్లు వుంటాయి. సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్, త్రిబుల్ బెడ్‌రూం ఫ్లాట్లకి ఒక్కో రేటు, ఇళ్ళకి ఒకరేటు, ఇలా ఒక్కో దానికి ఒక రేటు వుంటుంది. రేటులు, బేరసారాలుండవు. కన్సెషన్ వుండదు. ఫిక్సెడ్ అన్నమాట!''

''నువ్వు లిస్ట్ చెపుతుంటేనే మాకు గుండె ఆగినంత పనవుతుంది. ఇక రేటు చెపితే మేం పడిపోతామేమో'' అన్నారు జీవంలేని నవ్వు నవ్వుతూ.

''అయితే మీకు కమర్షియల్, వి.ఐ.పి ఏరియాలు కలిసిరావు. జనరల్ ఏరియాలో తీసుకోండి. అక్కడ అయితే నార్మల్ రేట్లు ఉంటాయి''

''ఆ జనరల్ ఏరియాలేంటో చెప్పు''

''అలా అడిగారు బావుంది! జనరల్ ఏరియాలంటే సింగ్‌నగర్, పాయకాపురం, రాజరాజేశ్వరిపేట, రామవరప్పాడు, ప్రసాదంపాడు ఏరియాలు''

''అయితే రామవరప్పాడులో చూడు, బస్సు సర్వీస్ బాగుంటుంది''

''ఫ్లాటా! ఇల్లా!''

''ఇల్లే చూడు! మూడు, నాలుగు గదులుంటే సరిపోతుంది'' అన్నాడు.

''అయితే రామవరప్పాడు కరెన్సీనగర్‌లో ఇల్లుంది. అద్దె అయిదువేలు'' అన్నాడు.

''అమ్మో! అంత అద్దె అంటే కష్టం'' అన్నాడు రకీమని.

''మీరు అద్దెకే అలా అంటున్నారు. ఇంకా కండిషన్స్ చాలా వున్నాయి''

''ఏమిటి? ఇక్కడ కూడానా!'' అన్నాడు నాలిక్కరుచుకుని.

## నానీలు

మనిషి బాల్యంలోని
బలే పసందైన కోణం
తెలుసా!? అదే
అమాయకత్వం!!

మనిషి యవ్వనంలోని
రసరమ్య కోణం
తెలుసా!? అదే
ప్రేమను పొందడం!!

మనిషి వృద్ధాప్యంలోని
దుస్థితి కోణం
తెలుసా!? అదే
అనాథగా మారడం!!

మనిషి ప్రవృత్తిలోని
కటిక చీకటి కోణం
తెలుసా!? అదే
కర్కశత్వం!!

మనిషి ప్రవృత్తిలోని
ఉషకాంతి కోణం
తెలుసా!? అదే
మంచి- మానవత్వం!!

కొడవలి సత్యనారాయణ

''మీరలా నాలిక కరుచుకోవాల్సిన పనిలేదు. విజయవాడలోనే కాదు, చుట్టుపక్కల ఏరియాలలో ఇళ్ళు కావాలన్నా కండిషన్స్ తప్పనిసరి''

''ఒరేయ్! గోపి! నువ్వు చెప్పినట్లు ప్రమోషన్ వరం కాదు శాపం'' అన్నాడు చెవిలో.

''ఏమిటి? చెవులు కొరుక్కుంటున్నారు. మీరు చెవులేకాదు, ఏది కొరుక్కున్నా ఇక్కడ ఇల్లు కావాలంటే ఎంతలేదన్నా నెలకు ఏడెనిమిది వేలుండాలి! అది కూడా తక్కువలో తక్కువ''

''అద్దె ఎనిమిదివేలా! అదీ తక్కువలో తక్కువ. ఏం చెప్పావురా నాయనా! ఏకంగా లోన్ తీసుకుని ఇల్లు కట్టుకుంటే ఈ ఎనిమిదివేలు బ్యాంక్‌కి జమకడితే రిటైరయ్యే నాటికి స్వంత ఇల్లు మిగులుతుంది''

''ఏమిటి! నెలకు ఎనిమిదివేలు కట్టి ఇల్లు కొట్టేద్దామనే! ఆశకు హద్దుండాలి సార్! లాటరీలో పదిరూపాయలు తగలాలని కోరుకోవటంలో తప్పులేదు. ఏకంగా కోటిరూపాయలు కాయాలని కోరుకోవటం అవివేకం. మీరు ఇల్లు కట్టాలంటే మినిమం 40 లక్షలుండాలి. ఫ్లాట్ కొనాలన్నా పాతికలక్షలుండాలి. బ్యాంక్‌వారు ఇచ్చే పాతిక లక్షలకి సాధారణ వడ్డీ రూపాయి వేసుకున్నా మీరు నెలకు 25 ఏవుల వడ్డీని కట్టాలి. మరి అసలు ఎప్పుడు కడతారు. ఊహలపల్లకిలో విహారం చెయ్యటమే మన పని''

''ఇవన్నీ మీకెలా తెలుసు''

''ఈ ఇళ్ళ వ్యవహారంలో తలపండినవాడ్ని సార్! నేను''

''అదేంటి! నీకు నెత్తిమీద ఒక్క వెంట్రుకకూడా తెల్లబడలేదు''

''అబ్బా నేను చెప్పింది తలపండటం అంటే అది కాదు. అనుభవం గురించి చెపుతున్నాను'' అన్నాడు విసుగ్గా.

''అలా చూసుకున్నా నీకు నిండా నలభై కూడా వున్నట్లు లేవు! అప్పుడే అంత అనుభవమా?'' అన్నాడు ఆశ్చర్యంగా.

''అబ్బ మీరు మరీ చచ్చు ప్రశ్నలేయకండి! ఇంతకీ ఇల్లు కావాలా? వద్దా?''

''గొంతుమీద కత్తిపెట్టి ఛస్తావా! బ్రతుకుతావా! అన్నట్లుంది- ఆలోచించుకోని''

''సరే! మీరు ఆలోచించి నాకు ఈ నెంబర్‌కి ఫోన్ చెయ్యండి'' అని విజిటింగ్ కార్డిచ్చాడు.

''ఏమిటయ్యా! కార్డునిండా సెల్‌నెంబర్లే. అడ్రస్ ఎక్కడా లేదు''

## వాస్తవాలు

పనికిరానిదెట్టిదైన
పనికి వచ్చునెప్పుడైన
పారవేయకట్టిదాన్ని
పదిలపరచు ఎచ్చటేని॥
    ఆగింది బస్సు
    దిగింది మిస్సు
    'నో' అంది కిస్సు
    వాపోయింది మనస్సు
వానలో కావాలి గొడుగు
ఎండలో కావాలి మడుగు
ఏమి కావాలో అడుగు?
గొడుగు మాత్రమివ్వడు బుడుగు॥
    ఇంట్లో ఉన్నది కుంచం
    సమాజంలో ఉన్నది లంచం
    దేనిని ఊరికే ఉంచం
    కుంచెడు లంచం కొంచెం॥
వరునికి కావాలి విత్తం
వధువుకి కావాలి సూత్రం
ఎడిటర్‌కు కావాలి హామీపత్రం
స్టూడెంట్‌కు కావాలి కాపీ పత్రం॥
    తప్పటడుగు తొట్రుబాటు
    ప్రేమించుట పొరపాటు
    నెల తప్పుట గ్రహపాటు
    తిరుగుబోతు కలవాటు॥
ఆమె పేరు శాంతి
ఈమె కున్నదశాంతి
శాంతికెప్పుడు విశ్రాంతి
విడాకులిస్తే ప్రశాంతి॥
    పప్పులో ఉన్నది ఉప్పు
    కట్టెకున్నది నిప్పు
నీకు కావాలి అప్పు
అది నన్నడుగుట తప్పు॥

మల్లాది నరసింహమూర్తి

## స్వాతంత్ర్యదినం!

స్వేచ్ఛావాయువుల్ని పీల్చేదినం
స్వేదం నుంచి సేదతీరే దినం
పేదవాని కడుపు నిండే దినం
అనారోగ్యుల ఆశలు చిగురించే దినం
ఖైదీలకు వరమొసగే దినం
ఖద్దర్ల కన్నులే ఊపిరిసలపని దినం
నేతల చిత్రపటాలకన్నులైన పండుగ దినం
భారతమ్మ కన్నీటిని తుడిచే దినం
పిల్లలకు చాక్లెట్లు దొరికే దినం
పంతుళ్ళకు దేశభక్తిని నేర్పేదినం
నేతల ఊహల్లో నిదురోతున్న
దేశభక్తి మేల్కొనే దినం
స్వాతంత్ర్య సమరయోధులంతా
ఉలిక్కిపడి లేచే దినం
వెరసి భారతంలో మువ్వన్నెల జెండా
స్వేచ్ఛగా ఎగిరే దినం
అదే ప్రతీసారీ మనమంతా
మరెంతో ఘనంగా జరుపుకునే
స్వాతంత్ర్యదినం

*దోసపాటి సత్యనారాయణమూర్తి*

''అదా! ఈ విజయవాడ మహానగరంలో నాకంటూ ఒక అడ్రస్‌లేదు మరి...''

''ఇల్లు కుదిర్చేవాడివి! నీకే ఇల్లు లేదా! హతవిధి! ఎంత దౌర్భాగ్య పరిస్థితిలో వున్నాం మనం''

''మీరలా వర్రీ కాకండి. నాకంటూ అడ్రస్ లేదన్నాను కాని, అన్నీ ఇళ్ళు నావే!''

''ఏమిటోనోయ్! నిన్ను చూస్తుంటే ఒక 'పజిల్'లా మాకు అర్థమైచావటంలేదు''

''సరే నేవస్తాను! ఇప్పటికే నాకు రెండువేలు నష్టం మీవల్ల అని వెళ్ళాడు''

''అదేంటి గోపి! వాడికి మనవలన రెండు వేలు నష్టం అంటాడు''

''ఏమిటో నాకర్థం అయిచస్తేగదా, నీకు చెప్పటానికి! పద ఇప్పటికే పది దాటింది'' అన్నాడు.

''వామ్మో! జీతంలో సగంపైగా అద్దె ఇల్లుకి పోతే ఏం తినాలి? ఎలా బ్రతకాలి?''

''బ్రతకటం అలవాటవుతుందిలే! మేమంతా బతకటంలా, నువ్వు అంతే!'' అన్నాడు బైక్ స్టార్ట్ చేసి.

ఇంకో రెండు రోజులు తిరిగినా ఫలితం కనిపించక పోవటంతో చిన్నారావుకి ఫోన్‌చేసి అన్ని కండిషన్‌లకి ఒప్పు కుంటాం. ఇల్లు చూడమన్నారు.

చిన్నారావు ఫోన్‌లో మరో బాంబు పేల్చాడు.

''మీకు చెప్పిన అద్దె విషయం రెండు రోజులకింద టిది. ఇప్పుడు రేటు పెరిగింది. ఆరువేలు'' అన్నాడు.

''అదేంటి! ఒకేసారి వెయ్యి పెరిగింది!''

''ధరలండి ధరలు! మార్కెట్‌లో ఎలా వున్నాయో మీకు తెలియదా!'' అన్నాడు.

''సరే కాని! ఏంచేస్తాం! ఇంతకీ ఎక్కడ కలవమంటావు?''

''సాయంత్రం 6 గంటలకు హోటల్ ఇలాపురంకి వచ్చేయండి. వివరాలు మాట్లాడుకుందాం''

''అలాగే!'' అన్నాడు సుధాకర్ నీరసంగా.

''అలా నీరసపడిపోతావేంటిరా!''

''వాడు ఇలాపురంకి రమ్మన్నాడురా! బిల్లు ఎంతవుతోందోనని భయంగా వుంది''

''సగం, సగం మునిగితే భయంగాని. పీకలదాకా మునిగాక భయం ఎందుకు?'' అన్నాడు.

❖ ❖ ❖

సాయంత్రం 6 గంటలకి ఇలాపురం దగ్గర చిన్నా రావుని కలిశారు.

''రండి సార్! లోపల టిఫిన్ చేస్తూ మాట్లాడు కుందాం'' అన్నాడు.

''ఎదురు బండి దగ్గర బాగుంటుంది చిన్నారావు గారు! అక్కడ టిఫిన్ చేసి, టీస్టాల్‌లో వేడివేడిగా టీ తాగుతూ మాట్లాడుకోవచ్చు, ఏమంటారు?'' అన్నాడు సుధాకర్.

''మీరు మరీ ఇంత కక్కుర్తి మనుషులని అనుకో లేదు. అక్కడ టిఫిన్ చేస్తే నా లెవెల్ పడిపోతుంది. అయినా బిల్‌దేం వుంది? నా కమీషన్‌లో కట్ చేసు కోండి'' అన్నాడు.

''మీరు చాలా ఉదార స్వభావం కలవారుగా వున్నారు. ఆమాత్రం హామీ ఇస్తే మీరు చెప్పినట్లే చేస్తాం. పదండి!'' అన్నారు.

ఐలాపురం రెస్టారెంట్‌లో కూర్చుని టిఫిన్ ఆర్డర్ చేశాడు చిన్నారావు.

''చెప్పండి చిన్నారావుగారు! మీ కండిషన్స్ ఏమిటో!''

''మీరు భలేవారే! నాకండిషన్స్ ఏం వుండవు. నాదల్లా నాకు రావాల్సిన కమీషన్. మిగతా విషయాలు మీరు అద్దె ఇల్లు యజమానితో మాట్లాడుకోండి!''

''మీ కమీషన్ ఎంతో చెప్పారు కాదు''

''అద్దెలో 15 శాతం. మీరు ఎన్ని నెలల అద్దె అడ్వాన్స్ ఇస్తే అన్ని నెలల కమీషన్ నాకివ్వాలి. తర్వాత ఒకటవ తేదీ వచ్చి నా కమీషన్ వసూలు చేసుకుంటాను. అన్నట్లు ఇంకో విషయం. మీరు అద్దె విషయంలో 'లేట్' చేసినా నాకు సంబంధంలేదు. కమీషన్ మాత్రం ఒకటవ తేదీనే ఇవ్వాలి'' అంతలో ఇంటి ఓనర్ ప్రతాపరావుగారు కూడా వచ్చారు. ''రండిసార్! మీ విషయమే మాట్లాడుకుంటు న్నాం. ఈయన సుధాకర్, ఆయన గోపాలకృష్ణ'' అంటూ పరిచయం చేశాడు.

''మీ ఇద్దరిలో అద్దెకు వుండేదెవరు?''

''నేనేనండి. వీడు నా ఫ్రెండ్ మీరు వివరాలు చెబితే!''

''మా చిన్నారావు చెప్పలేదా?''

''లేదండి! మీరు మీరు ముఖాముఖి మాట్లాడు కుంటే బాగుంటుందిగదాయని''

''అలాగే! అద్దె విషయం చెప్పి వుంటాడు. నెలకి ఆరువేలు. 6 నెలల అద్దె అడ్వాన్స్‌గా ఇవ్వాలి. మోటర్‌కి రెండు వందలు. అదనంగా మనిషికి ఏభై రూపాయలు. అంటే పర్మనెంట్‌గా ఇంట్లో వుండేవాళ్ళకి కాదు. గెస్ట్‌లకి మాత్రమే. కరెంట్ బిల్లు సపరేట్‌గా వస్తుంది. మెయింటినెన్స్ కింద అయిదువందలు. డేమేజి ఖర్చులు రెండు వందలు. ఆరు నెలలకొకసారి అద్దె పెంచాలి. సంవత్సరంలో ఒక నెలలో రెండు నెలల అద్దె ఇవ్వాలి. ఇల్లు జాగ్రత్తగా చూసుకోవాలి. రాత్రి పది గంటలకి మెయిన్‌గేట్ తాళం వేస్తాం. అయిదు సంవత్సరాలు ఎగ్రిమెంట్ వ్రాయాలి. ఇవే షరతులు.

''మీరు చెప్పిందంతా బాగానే వుంది. కాని మరీ 6 నెలలకి అద్దె పెంచటం. సంవత్సరంలో ఒక నెలలో రెండు నెలల అద్దె ఇవ్వటమే బాగోలేదు'' అన్నాడు సుధాకర్.

''ఓహో! అదా! మీ అనుమానం మీరు ప్రభుత్వ ఉద్యోగులు కదా! మరి ప్రతి 6 నెలలకి మీరు డి.ఎ. ఇస్తారుగా. సంవత్సరంలో ఒకసారి బోనస్ ఇస్తారుగా అందుకన్నమాట''

''అది మార్కెట్‌లో పెరిగే ధరలనిబట్టి కదా ఇస్తారు''

''ఏమండి మీరు ధరలు పెరిగితే మాకు పెరగవా? షాపువాళ్ళు మీకొక రేటు, మాకొక రేటు ఇవ్వరుకదా! మరి మీకు మాత్రమే జీతాలు పెరిగితే అద్దెలమీద బ్రతికేవాళ్ళం మాకు మాత్రం పెరగవద్దా! మీరే చెప్పండి న్యాయం!'' అన్నాడు.

''అంటే మీరు పెరిగే డి.ఏ. ప్రకారం అద్దె పెంచుతారా?''

''కరెక్టుగా చెప్పారు! అంతే అలాగే చేస్తాం'' అన్నాడు.

అంతే సుధాకర్ ఢామ్మని పడిపోయాడు.

''ఏమిటండి ఆయన అలా పడిపోయాడు'' అన్నాడు ప్రతాపరావు.

''అహ్హహ్హా అద్దె ఇల్లా! మజాకానా'' అంటూ పగలబడి నవ్వాడు గోపాలకృష్ణ. ■

## స్వాతంత్ర్య గీతి

అదిగదిగో అదిగదిగో
ఎగురుతోంది మనపతాక
ఎదుగుతోంది ఎదుగుతోంది
దిగంతాల దాక ॥అదిగదిగో॥
కులమతాల భేదాలు
ఎరుగనట్టిది
పలుభాషలు తనలోన
నిలుపునట్టిది
మానవతా పరిమళాలు
పంచునట్టిది
సమత మమత సౌభ్రాత్రం
పెంచునట్టిది ॥అదిగదిగో॥
అల్లూరి భగత్‌సింగ్
ఊపిరైనది
గాంధీజీ నెహ్రూజీ
కలలుకన్నది
సంస్కృతియే సంపదగా
మురిసినట్టిది
వేదాంతం లలితకళలు
విరిసినట్టిది ॥అదిగదిగో॥

బద్దినాగేశ్వరరావు